# దోసిట్లో నీళ్ళు

ఒక కథకుడి నేర్పు, అనుభవం, తాత్వికత– కథ పేరు నుండి ముగింపు వరకు ప్రతిబింబిస్తాయి. 'దోసిట్లో నీళ్ళు' జారిపోతాయి. మనం అలసట చెందినప్పుడు ఆ నీళ్లతో ముఖం కడుక్కొని సేదతీరుతాం. దోసిట్లో మనల్ని మనం చూసుకుంటాం. ప్రకృతిని చూస్తాం. ఈ కథలో అన్నీ వున్నాయి. ఓ సాధారణ గృహిణి జీవనయానం ఈ రచన. సుభద్రమ్మ అనే స్త్రీ కేవలం తన పిల్లలకే కాక అందరికీ 'అమ్మ'గా ఎలా రూపాంతరం చెందిందనేది అద్భుత కథనం. జీవితపు మలిదశలో బతుకుని ఎలా పండించుకోవాలో తెలుసుకోవటానికి అందరూ చదవాల్సిన కథ యిది. స్పందించే హృదయం, జీవితం పట్ల ఓ దృక్పథం వున్న 'విహారి'గారి లాంటి సీనియర్ రచయిత కొండంత విషయాన్ని ఈ చిన్నకథలో పొదిగారు.

- పి. చంద్రశేఖర ఆజాద్

అమ్మ చేతి భోజనం, మామిడికాయ పప్పు, పెసరావకాయ, కందాబచ్చలికూర, క్యాబేజీ పెరుగు పచ్చడి, నెయ్యీ, గడ్డ పెరుగూ సరేసరి!

భాస్కరంకి భుక్తాయాసంగా వుంది. నడవాలో కుర్చీలో వెనక్కు వాలి, కాళ్లు సాచి దేహాన్ని తేలికపరిచాడు.

ఎదురుగా వున్న మంచం గోడవారగా వాల్చుకుని పడుకున్నాడు సుందరం.

'అన్నదాతా సుఖీభవ' అని భోజనం చేసి అతిథి దీవెన. "సుభద్రమ్మగారి మనసు మంచిది" అని, "నే వస్తానమ్మా!" అంటూ తన బ్యాగ్‌ని చేతిలోకి తీసుకున్నాడు.

సుభద్ర లోపల్నుంచి వచ్చింది– "మంచిది సార్, ఉంటాను!" అని నమస్కరించింది.

ఆయన కూడా నమస్కరించి సెలవు తీసుకున్నాడు. వెళ్తూ వెళ్తూ భాస్కరంకేసి చూస్తూ "మీ అమ్మ దొడ్డది" అని చేతిసైగతో, పెదవుల కదలికతో వీడ్కోలన్నాడు.

ఏదో ఫైనాన్స్ కంపెనీ ఉద్యోగిట. సర్వేకోసం వచ్చాడట. ఊరివారెవరో సుభద్రమ్మని అడిగారట– ఈ పూటకి ఆయనకు భోజనం ఏర్పాటు చేయమని. ఈమెకు అదే సంతోషం. 'మా అమ్మకి ఎందరెందరి దీవెనలో..!' అనిపించింది భాస్కరంకి. సన్నగా నవ్వుకున్నాడు.

వంటగదిలో తన భోజనం ఏర్పాట్లలో వుంది సుభద్ర. వసారాలోకి ఎవరో వచ్చారు.

"అమ్మమ్మా!" పిలుపు.

ముందుకి వంగి కళ్ళు విచ్చి మెడ సారించి చూశాడు భాస్కరం.

పదేళ్ల పిల్ల... చేతిలో హిండాలియం గిన్నె.

"లోపలికి రావే భారతీ!" అమ్మ కేక.

భారతి లోపలికి వెళ్లింది- "మా అమ్మమ్మ కాసిని మజ్జిగుంటే పోయించుకు రమ్మంది."

"పోస్తాగానీ, ఏమే... ఈ పూట అన్నం వండిందా?"

జవాబు లేదు.

గిన్నెలో మజ్జిగ పోస్తున్న శబ్దం.

"ఏమిటి? చెప్పు!" సుభద్ర.

భాస్కరం వింటున్నాడు.

"ఉహూఁ... తాతయ్య రాలేదింకా!" బెరుకు సమాధానం.

"ఆ... ఆఁ... ఎప్పుడొచ్చాడులే మీ తాతయ్య! వచ్చినా తెచ్చేదేం వుంది? ఉండు!" అంటూ బియ్యపు డ్రమ్ము తీసింది.

భాస్కరం లేచివచ్చి గుమ్మం పక్కగా నిలబడ్డాడు.

పాత ఖాకీసంచీ తీసి ఆ పిల్ల చేతికిచ్చింది. "పట్టుకో..." అంటూ డ్రమ్ములోంచి పాలడబ్బాతో ఐదు డబ్బాల బియ్యం పోసింది. డ్రమ్ము మూత పెట్టింది- "వెళ్లు. త్వరగా కానీమను- మీ అమ్మని. నీ చెల్లెళ్ళిద్దరూ పాపం ఆకలికి నకనకలాడుతూ ఉండివుంటారు" అని, అంతట్లోనే మళ్లీ ఏదో గుర్తుకొచ్చినదానిలా "ఒక్క క్షణం..." అంటూ డబ్బా తీసి నాలుగు చేరల కందిపప్పుని ప్లాస్టిక్ కవర్లో పోసి, మూతి కట్టి, ఖాకీసంచీలో పడేసింది. "పద..." అన్నది.

ఒక చేత్తో సంచీనీ, రెండో చేత్తో మజ్జిగ గిన్నెనీ పట్టుకుని బయటకి నడిచింది భారతి.

"ఎవరమ్మా వీళ్ళు?" అడిగాడు భాస్కరం.

అన్నానికి కూర్చుంది సుభద్ర.

"మన వీధి చివర అవధానిగారు లేరూ... ఆయన మనవరాలు, బతికిచెడిన కుటుంబం, పౌరోహిత్యం చేస్తారు. వయసయిపోయింది. రాజమండ్రి పోయి రేవులోనో, సత్రం దగ్గరో యజమానుల కోసం ఎదురుచూస్తూ వుంటాడు. నాలుగు రూపాయలు దొరికితే పొయ్యిలో పిల్లి లేస్తుంది. లేకపోతే ఆ రోజుకి అభోజనమే. ఇంట్లో భార్యా, తల

చెడి పుట్టింటికి చేరిన కూతురూ, ఆమె ముగ్గురు పిల్లలూ మానానికి మగ్గుతూ నానా అవస్థలు పడుతున్నారు. వాళ్ళ పరిస్థితి తలచుకుంటే గుండె నీరవుతుంది."

సుభద్రకి అన్నం సయించటం లేదు, బాధగా వుంది.

భాస్కరం గమనించాడు. తిరిగివచ్చి నడవాలో నడుం వాల్చాడు. సుందరం అప్పటికే గురకలో వున్నాడు.

భాస్కరం ఆలోచనలో పడ్డాడు...

తాను పొద్దుననగా వచ్చాడు. 'మామయ్య సుందరం వచ్చిన తర్వాత మాట్లాడుకో వచ్చులే!' అని ఆగాడు. ఆయనొచ్చేసరికే పదిగంటలు దాటింది. ఆ తర్వాత అమ్మ వంటపనిలో పడింది. విషయ ప్రస్తావనకి అవకాశం కలగలేదు. మామయ్యా, తనూ కలిసి ఇంటిముందు తోటలో చెట్లనీ, మొక్కల్నీ పలకరిస్తూ తమలో తాము సమస్యని చర్చించుకుంటూ గడిపేశారు.

వడగాలి వసారాని దాటి నడవని దబాయిస్తున్నది. బయట ఎండ గ్రుడ్లురుము తోంది. మంచంలో మసిలాడు భాస్కరం. అసహనంగా వుంది. 'ఈసారన్నా పని సానుకూలమవుతుందో, లేదో?!' మొహమంతా చెమట పట్టింది. తువ్వాలుతో తుడుచుకుని వెల్లకిలా పడుకున్నాడు. సీలింగ్ ఫ్యాన్ జోలపాడుతోంది.

కొద్దిసేపట్లోనే భాస్కరంకి కునుకుపట్టింది.

-వసారాలోని కలకలం భాస్కరం నిద్రని చెడగొట్టింది. మంచం దిగి, నీళ్లుతాగి, చూశాడు.

పది, పన్నెండుమంది నడివయస్సు ఆడవాళ్ళు- కుట్లూ, అల్లికలూ చేస్తున్నారు. అమ్మ వాళ్ళందరికీ సూచనలూ, సలహాలూ ఇస్తున్నది. కొంతమంది ప్లాస్టిక్ డెకొరేటివ్ ఐటమ్స్‌ని తయారుచేస్తున్నారు.

మళ్లీ మంచంమీద పడుకున్నాడు భాస్కరం. పక్కన షెల్ఫ్‌లో పుస్తకాలూ, ఏవో పత్రికలూ ఉన్నాయి. ఒక పుస్తకం తీసుకున్నాడు. 'తిరిగి గ్రామాలకి...' పేజీలు తిరగేయసాగాడు. క్షణాల్లో మళ్లీ నిద్ర పట్టింది.

భాస్కరం ఈసారి నిద్రలేచేసరికి ఐదు గంటలు కావస్తోంది. ఎదురు మంచం ఖాళీగా వుంది. లేచి దొడ్లోకి నడిచాడు. సుందరం పెరట్లో మొక్కల్ని చూస్తూ బాదంచెట్టు క్రింద కూర్చుని ఉన్నాడు.

మాటల్లోనే టీ తెచ్చింది సుభద్ర.

"రామమందిరంలో రోజూ ఓ గంట రామాయణం చెప్తాను. వెళ్దాం. తయారుకండి. పరిచయస్తులెవరైనా వస్తే కలవ్వొచ్చు!" అన్నది.

సుందరం, భాస్కరం మొహమొహాలు చూసుకున్నారు.

వాచీ చూశాడు సుందరం. ఐదున్నర!

భాస్కరం గ్రహించాడు. తల్లివైపు పరీక్షగా చూశాడు. క్షణం తీరిక లేకుండా సమయాన్ని సద్వినియోగం చేసుకొనే ఆమె అలవాట్లూ, స్వభావమూ అతనికి తెలిసినవే.

ఆమె దినచర్య కళ్ళముందు మెదిలింది...

తెల్లవారుఝామునే ఇంటిపనీ, రెండు గేదెల పనీ అయిపోతాయి. తెలతెలవారు తుండగా గోదావరి స్నానం. ఇంటికొచ్చిన తర్వాత ఓ గంట జపం, పూజ. ఆ తర్వాత చెట్లూ, మొక్కలూ పర్యవేక్షణ, వంట, భోజనం. మధ్యాహ్నం ఆమె నిద్రపోదు. వచ్చిన పిల్లలకి సంగీత పాఠాలు చెప్తుంది. అది కాగానే వచ్చే ఆడవారికి స్వయం ఉపాధి పనుల మీద శిక్షణ. అప్పుడెవరన్నా ఊరివారు ఏ గచ్చాకు పున్నాకు వైద్యానికో వస్తారు. ఆరవుతుంటే- ఇందాక చెప్పినట్టు- రామాలయంలో ప్రవచనం!

డెబ్బయ్ ఏళ్ల వయస్సులో కూడా ఆమె తన జీవన విధానాన్ని నియమబద్ధంగా ఒక పద్ధతిలో నడుపుకోగలగటం- చూసేవారికి ఆశ్చర్యం కలిగిస్తూ వుంటుంది.

ఇప్పుడు భాస్కరంకీ అలాగే అనిపించింది.

పది నిముషాలు తక్కువ ఆరుగంటలు. ముగ్గురూ బయటికి కదిలారు.

రామమందిరం ప్రాంగణంలో పచ్చదనం, పరిశుభ్రత వెల్లివిరుస్తున్నాయి. పక్కనే టెన్నిస్ కోర్టంత సమావేశ మంటపం, దాన్ని ఆనుకుని 'రీడింగ్ రూమ్- లైబ్రరీ' కనిపిస్తోంది.

దేవతా విగ్రహాల్ని దర్శించుకుని, మీటింగ్ హాల్లోకొచ్చారు.

అప్పటికప్పుడే కొందరు కూర్చుని వున్నారు. క్షణాల్లోనే స్త్రీ పురుషులతో హాలు నిండిపోయింది.

వేదిక మీద సుభద్ర. గళమెత్తి శ్లోకాలు చదివి అర్థం చెప్తోంది. అయోధ్యకాండం. రాముడు దశరథ మందిరానికి వచ్చాడు. అదీ ఘట్టం!

దశరథుడు నేరుగా వాచ్యం చేయని కోరికని, తండ్రి ఆజ్ఞగా గ్రహించి బాస చేశాడు రాముడు. 'రాముని కష్టాలపాలు చేస్తున్నానే...' అని దశరథుని వేదన. ఇతర రామాయణాల్లోని పద్యాలు చదువుతూ సమన్వయం చేస్తోంది సుభద్ర. మధురంగా సాగుతోంది ప్రసంగం. రసభావ భరితంగా వుంది ప్రవచనం.

తల్లి వైపు మౌన ప్రశంసాపూర్వకంగా చూశాడు భాస్కరం. ఎన్నెన్నో ఆలోచనలు మనసుని ముసిరినై.

హైస్కూల్‌లో టీచర్‌గా చేసి రిటైరయింది తల్లి. తండ్రి కూడా స్కూల్ టీచరే. ఆయన చనిపోయి ఇరవై ఏళ్లయింది. అప్పటికే పద్మక్క పెళ్ళయి కాపురానికి వెళ్లింది.

బావ సూర్యంకి ఢిల్లీలో గవర్నమెంట్ ఉద్యోగం. ఇప్పుడు ఇద్దరు పిల్లలు. బి.టెక్., ఇంటర్‌లో ఉన్నారు. ఆ తర్వాత తనకు హైదరాబాద్‌లో చిన్న ఉద్యోగం. లలితతో పెళ్ళి. రాజూ, రమణీ పిల్లలు.

అమ్మని హైదరాబాద్ తీసుకుపోవాలి. ఐదారేళ్ల నుంచీ సాగుతున్న ప్రయత్నం. లలితా, పిల్లలూ రమ్మంటారు. పద్మక్కా, బావా అదే సలహా చెప్తారు. కానీ, అమ్మ కదలటం లేదు. ఇప్పుడు మావయ్యతో కూడా చెప్పించాలని ఆయన్నీ విశాఖ నుంచి పిలిపించారు.

ఆయనకి ఎన్నెన్నో పనులు నిజానికి. బిస్కెట్ ఫ్యాక్టరీ, హోటల్, రియల్ ఎస్టేట్– ఎంతో బిజీ. అయినా "సరే..." అన్నాడు. వచ్చాడు. ఇంక మాట్లాడాలి.

ప్రసంగం అయిపోయింది. ప్రస్తుతంలోకొచ్చాడు భాస్కరం.

సుందరం అన్నాడు– "అక్క చాలా డెవలప్ అయింది. ఆమె చాలా గ్రేట్!" అని.

ఇద్దరూ లేచి నిలబడ్డారు. సుభద్రా కదిలింది.

ఆమె దగ్గరగా ఎవరెవరో జిజ్ఞాసువులు. వారితో మాట్లాడుతూ నడుస్తోంది. నడుస్తూ మాట్లాడుతూ– ఇప్పుడామె లైబ్రరీలోకి వచ్చింది.

అక్కడ– సుమారు ఇరవైమంది విద్యార్థులున్నారు. విష్ చేశారు–

"నమస్కారం!" అంటూ ఆమె కూర్చుంది. భాస్కరంనీ, సుందరంనీ ఉద్దేశించి అన్నది– "నేను వీళ్ళకో గంటసేపు తెలుగు చెప్తాను. ఆ తర్వాత వెళ్దాం. కూర్చుంటే సరే... వెళ్తామంటే 'కీ' ఇస్తాను."

ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు– మేనమామా, మేనల్లుడూ. "ఉంటాంలే. కానీ..." అన్నారు చివరికి. ఓ పక్కగా కుర్చీలో కూర్చున్నారు.

– ఆ కార్యక్రమం అయింది.

– ఇల్లు చేరారు.

భోజనం చేస్తూ మాట్లాడుకోసాగారు. సుందరం మొదలెట్టాడు–

"రామమందిరం బాగా అభివృద్ధిలో కొచ్చింది. ఆనాడు నీ రిటైర్‌మెంట్ బెనిఫిట్సన్నీ పెట్టి ఆరంభించిన నిర్మాణం ఇవాళ బాగా విస్తరించింది."

"స్థలాన్ని దానం చేసిన నాయుడుగారి పేరు చెప్పుకోవాలి ముందు. అది వుండటం వలన నాకా బుద్ధి పుట్టింది..." సుభద్ర.

"సరే... ఆ విషయమంతా బాగుంది. నువ్వింక ఈ ఝంఝాటాలు వదులుకుని భాస్కరం దగ్గరికి చేరితే బాగుంటుంది. వచ్చే వయస్సే కానీ..." మాట నాన్చాడు సుందరం.

తమ్ముడి మాటకి ఆయనకేసి చూడకుండా భాస్కరం కళ్ళలోకి చూసింది సుభద్ర.

"అదే గదా నేనూ, అక్కా కూడా అడుగుతున్నది!" అన్నాడు భాస్కరం.

"ఇప్పుడంతా బాగానేవుంది కదా... పెన్షన్ వస్తోంది నాకు. గేదెలున్నై. వాటికో కుర్రాడున్నాడు. తోటా, దొడ్డీ, ఇల్లూ... గడిచిపోతోంది. ఇంటాబయటా నా కాలక్షేపం నాకుంది. నే వచ్చే సంగతి పక్కనబెట్టండి... మీ విశేషాలు చెప్పండి!" అన్నది సుభద్ర.

భాస్కరంకి తెలుసు- ఇక ఆమె ఆ విషయం మాట్లాడదు. అదే మాటని సాగదీయటమూ ఇష్టం వుండదామెకు. ఈ సంగతి సుందరమూ ఎరగనివాడేమీ కాదు.

సమయం మౌనంలో గడిచిపోయింది... ఎవరి ఆలోచనల్లో వారున్నారు.

భోజనాలైనాయి...

రాత్రి తొమ్మిదవుతోంది!

"అయితే నే వెళ్లొస్తా అక్కా! వస్తా భాస్కరం!" అని రక్కున లేచాడు సుందరం.

ఆ రాత్రికి ఉండమన్నది సుభద్ర. భాస్కరమూ అడిగాడు.

"కాదులే... పనులున్నై!" అని కదిలాడు. వెళ్తూ వెళ్తూ మరోసారి విషయాన్ని హెచ్చరించాడు- "కాళ్లూచేతులూ ఆడినంత కాలం బాగానే వుంటుంది. కాని, కాలం ఎప్పుడూ మనది కాదు గదా! భాస్కరం రమ్మంటున్నాడు. వెళ్లటం మంచిదని నా అభిప్రాయం. ఆనక నీ ఇష్టం!" అంటూ కారెక్కాడు.

సుందరం అలా వెళ్లగానే ఇలా వచ్చాడు నాయుడు.

భాస్కరంకి తెలుసాయన. నాయుడికి భాస్కరం చిన్నప్పట్నుంచీ తెలిసినవాడే.

ఊరి కబుర్లూ, పాత జ్ఞాపకాలూ నడిచాయి.

"మీ అమ్మానాన్నా కష్టజీవులు భాస్కరం! ఇద్దరూ ఉద్యోగాలు వెలగబెట్టారని పేరే గానీ, ఏనాడూ కలిసి ఒక వూళ్లో పనిచెయ్యలేదు. అలాగని ఏడుపు మొహాల్తో ట్రాన్స్‌ఫర్ల కోసం ఎవరినీ దేబిరించలేదు. అక్కనీ, నిన్నూ పెంచి పెద్దచేసిన శ్రమా, కష్టం, ప్రయాసా- అన్నీ మీ అమ్మవే. ఎన్నెన్ని అగచాట్లు పడిందో సన్నిహితులకే తెలుసు. కానీ, ఆమె ధైర్యం చెక్కుచెదరనిది. ఇక సేవాభావం అంటావా..." అని క్షణం ఆగి, "చెప్పేదేం వుంది? నా భార్యే సాక్ష్యం!" అంటూ కళ్ళు మూసుకుని, దీర్ఘంగా నిట్టూర్చాడు.

క్షణాల తర్వాత చెప్పసాగాడు-

"అప్పుడు నువ్ బాగా చిన్నవాడివి... నా భార్యకి మశూచి వచ్చింది. శరీరమంతా తీవ్రంగా, దట్టంగా పొక్కులు, మంటలూ, బాధా. మనిషిని నగ్నంగా రోజంతా అరటి ఆకుల్లో పడుకోబెట్టి, ఆరగారగా నవనీతం పూయాల్సిన పరిస్థితి! గంటగంటకీ కమిలిపోయేవి ఆకులు. ఆమెని ఎత్తి కూర్చోబెట్టి ఆకుల్ని మార్చాలి. అన్నం ముద్దని అరచేతి నుంచీ ఆమె నోట్లోకి పెట్టాలి. నెలరోజులీ నరకం, యాతన. ఆ నెలరోజులూ ఆమెని సాకిందెవరో తెలుసా? మీ అమ్మ! ఆమె ఉపకార చింతన అంత గొప్పది. 'కులమూ,

కొంపా, మడీ, మైలా, అంటూ, సొంటూ' అని జనం- నలుగురూ నాలుగు విధాలుగా అన్నారు. 'బ్రాహ్మణ పిల్లవి, పిల్లలున్న దానివి... మంచిది కాద'నీ హెచ్చరించారు మీ కులపోళ్ళు. అమ్మ లక్ష్యపెట్టలేదు. మీ నాన్నా అంతే. 'అవసరంలో మనం మనం ఆదుకోకపోతే ఎట్లారా?' అన్నాడు. ముభావి కదా... వస్తుతహా. అందుకని అదొక్కటే మాట!"

నాయుడు చెప్పటం ఆపాడు.

భాస్కరం గుండె బరువెక్కింది. ముగ్గురూ మౌనంగా కూర్చున్నారు.

వేపచెట్టు గాలి ఆహ్లాదాన్ని పంచుతోంది.

మరో కాస్సేపు అయిన తర్వాత అన్నాడు నాయుడు- "మీ అమ్మకీ, ఈ వూరికీ వున్నది మామూలు సంబంధం కాదు. ఇవ్వాళ ఆవిడ ఊరంతటికీ 'తెలుగు' వెలుగు! 'భాష చచ్చిపోతుంది, చచ్చిపోతుంది' అని కేకలూ, అరుపులూ వేయటం కాక, క్రియాశీలంగా భావితరాన్ని గురించి తన చేతనైన ఉపకారం తాను చేస్తోంది. ఆమె ఈ ఊరు వదలి రావటమనేది అంత తేలికేం కాదు."

ఈ మాటలతో మళ్లీ వాతావరణం గంభీరంగా మారింది. ఎవరి ఆలోచనల్లోకి వారు జారారు.

-నాయుడు సెలవు తీసుకునేసరికి చాలా పొద్దుపోయింది.

భాస్కరంకి ఎందుకనో శరీరమంతా వేడి పడినట్లనిపించింది...

ఎన్నెన్నో ఆలోచనలు కలగాపులగంగా రేగినై. ఆచరణకు పనికొచ్చే ఊహలేవో స్ఫురించీ, స్ఫురించనట్టయింది.

సుభద్రలో ఏ·అలజడీ లేదు. మనసు ప్రశాంతంగా వుంది. హాయిగా నిద్రపట్టింది.

భాస్కరంకి మాత్రం- ఆ రాత్రి... ఆందోళనే మిగిల్చింది!

●

చీకటి పడబోతోంది!

భాస్కరం బస్‌కి వెళ్లాలి. ప్రయాణ సన్నాహంలో ఉన్నాడు.

సుభద్ర కొడుక్కి టిఫిన్ చేసి, ప్యాక్ చేసింది. మధ్యాహ్నం తాను తయారుచేసిన మిఠాయీ, దొడ్లో కాసిన సపోటాలూ, నిమ్మకాయలూ, ఒక గుమ్మడికాయ, పిల్లల కోసం తాను కొనివుంచిన చిన్న చిన్న వస్తువులూ అన్నీ సంచుల్లో సర్దింది.

అదిగో... అప్పుడు ఫోన్ చేసింది పద్మ.

భాస్కరం తీశాడు. కుశలప్రశ్నలూ, పరామర్శలూ అయినై.

"నిన్న వచ్చి ఇవ్వాళ తిరిగి వెళ్తున్నాను హైదరాబాద్‌కి. నీతో చెప్పాను కదా... ఇంకేమున్నయ్ విశేషాలు?... అంతా మామూలే... ఇదిగో- అమ్మతో మాట్లాడు!" అని రిసీవర్‌ని సుభద్రకిచ్చాడు.

పిల్లల్ని గురించీ, అల్లుడి గురించీ అడిగింది సుభద్ర.

"మాధవి బాగా చదువుతోందా? ఆఁ... బి.టెక్. అయిపోవస్తోంది. అవును... పెళ్ళి సంగతి సరేలేవే... ఇంకా టైముందిగా! కానీ, అందర్నీ అడిగానని చెప్పు..." ఇలా సాగింది సంభాషణ.

అయింది. కొడుకు వైపు చూసి "దానికా ఆడపిల్ల పెళ్ళి గురించే ఆలోచన. 'ఢిల్లీలో అన్నీ అవాంఛనీయ ఘటనలమ్మా- ఆడపిల్లకి సెక్యూరిటీ తక్కువ' అంటుంది... తెలుసుగా?!" అన్నది.

భాస్కరంకి టీ ఇచ్చింది.

టీ తాగుతూ మాట్లాడసాగాడు భాస్కరం-

"ఈసారీ వచ్చాను, తిరిగి వెళ్తున్నాను. నిరాశే మిగిలింది!" అని క్షణం ఆగి- ఎవరికో అక్కరలేనివారికి చెప్తున్నట్టు అన్నాడు- "నువ్విక్కడి ఎస్టాబ్లిష్‌మెంట్‌కి ముగింపు పలకనివ్వటం లేదు..." ఈ మాట అని శూన్యంలోకి చూస్తూ కూర్చున్నాడు.

సుభద్ర ఏమీ అనలేదు. ఖాళీ టీకప్పు తీసుకుని లోపలికి వెళ్లిపోయింది.

తప్పదన్నట్లు లేచి బ్యాగూ, చేతిసంచులూ తీసుకుని భారంగా కదిలాడు భాస్కరం.

సుభద్ర గుమ్మందాకా వచ్చి జాగ్రత్త చెప్పింది.

"వస్తా మరి!" అంటూ గబగబా అడుగులు కదల్చాడు భాస్కరం.

●

నాలుగు రోజుల తర్వాత-

హైదరాబాద్ నుంచి ఢిల్లీలోని అక్కతో ఫోన్‌లో మాట్లాడుతున్నాడు భాస్కరం...

"ఆమె ఆదర్శాలూ, ఛాదస్తాలూ ఆమెకుండనిద్దాం. ప్రపంచమంతా తనని మంచిదనుకోవాలనే తత్వం అమ్మది. బావగారూ, మనమూ ఇదివరకు అనుకున్నట్లు స్థలాన్నంతా మూడు భాగాలు చేసి, మన షేర్లని మామయ్య చేతిలో పెడదాం. కాంప్లెక్స్ సంగతంతా ఆయనే చూస్తాడు. తన పోర్షన్‌కొచ్చే ఏ నాలుగొందల గజాలో తనిష్టం వచ్చినట్టు చేసుకోమందాం అమ్మని. ఈ సమస్యకి ఇదే పరిష్కారం. నువ్విలా చెప్పెయ్ అమ్మకి. నిక్కచ్చిగా చెప్పటం నీకే చాతవును."

పద్మ ఏదో సమాధానం చెప్పింది.

"ఆఁ... ఒప్పుకోక ఏం చేస్తుంది? ఎంత తమ కష్టార్జితమైనా, ఉన్నది మనమిద్దర మేగా? ఎప్పటికైనా ఆ ప్రాపర్టీ మనదే కదా! మరోలా చేస్తే ఊరుకుంటామా?"

మళ్లీ ఏదో అన్నది పద్మ. భాస్కరం కళ్ళల్లో మెరుపు!

"ఎగ్జాక్ట్‌లీ... అదే నేననేదీ! వీలు చూసుకుని మన నిర్ణయాన్ని అమ్మకు చెప్పేయ్ అక్కా!" భాస్కరం గొంతులో ఉద్వేగం ధ్వనించింది. దానితోపాటు విషయాన్ని ఆమె నెత్తిన పెట్టేసినందుకు సంతృప్తీ గోచరించింది. ఫోన్‌లో మాటలు అయిపోయినై.

●

తల్లితో తమ నిర్ణయాన్ని చెప్పటానికి ఎప్పటికప్పుడు ప్రయత్నిస్తూనే వున్నది పద్మ. కానీ, ధైర్యం కూడదీసుకోలేకపోతోంది.

రోజులు గడుస్తున్నాయి.

ఉన్నట్టుండి ఒకరోజు...

తల్లి దగ్గర నుంచి కొరియర్ వచ్చింది పద్మకు. కవర్ విప్పి చూసింది–

"చి.సౌ. పద్మకు... ఉభయకుశలోపరి. నువ్వూ, తమ్ముడూ అనుకున్నదీ, కావాలనుకున్నదీ... ఇది! జాగ్రత్త! ఆశీస్సులతో... అమ్మ" ఉత్తరం కింద డాక్యుమెంట్స్!

సరిగ్గా అదే సమయానికి భాస్కరంకీ అలాంటి కొరియరే అందింది.

తల్లి చేసిన పనికి పద్మ, భాస్కరం ఇద్దరూ విస్తుపోయారు. తమ లౌక్యమూ, భద్రతా ఆమెకెట్లా తెలిశాయో అర్థంకాలేదు.

రామాలయంలో రామాయణ ప్రవచనం చెప్తూనే వుంది సుభద్ర...

'అమ్మతనం', 'సంతాన ధనం'– అన్నీ అందులోని నిధులే!!

●

' వాకాటి పాండురంగారావు స్మారక పురస్కారం ' పొంది
' జాగృతి ' వారపత్రిక ... 8 నవంబర్ ' 2010 సంచికలో ప్రచురితమైన కథ

"మీ 'దోసిట్లో నీళ్ళు' నా కన్నీళ్ళుగా మారాయి. మనసు ఆర్ద్రతకి గొంత పట్టేసింది. మీ కథల కొలిమిలో ఉక్కు హృదయాల్ని ఇలా కరిగిస్తూనే వుండాలని నా కోరిక."

– వి. కాంతారావు ( హన్మకొండ )